సాక్షి ప్రకాశం

శనివారం । 8 । జూన్ । 2024



బూచేపల్లి పరామర్శ

దర్శి నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి శుక్రవారం పరామర్శించారు.

- 8లో..



నైతికంగా విజయం సాధించాం

కనిగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నైతిక విజయం సాధించిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34/27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

వానొచ్చే.. ఆశలు చిగురించే..

- జిల్లాలో 246.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- 16 మండలాల్లో వానలు
- టంగుటూరులో అత్యధిక వర్షపాతం నమోదు
- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- సాగుకు అనుకూలమంటున్న రైతులు

వర్షం కురిసింది. నేల మురిసింది. నైరుతీ రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో వానలకు వాగులు, వంకలు కదిలాయి. పొలాలన్నీ తడిశాయి. ఖరీఫ్ సాగుకు అనుకూలమైన వాతావరణం నెలకొంటుందని అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. జూన్ మొదటి వారంలోనే విస్తారంగా వర్షాలు కురవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నాలుగైదు రోజుల క్రితం వరకూ మండుటెండలు, ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు ఉపశమనం లభించింది. వాతావరణం పూర్తిగా చల్లబడింది.



సీతానాగులవరం వద్ద రోడ్డుపైకి పొంగిన కొండవాగు

ఉప్పొంగిన కొండవాగు

తర్లుపాడు: రెండు రోజులుగా తర్లుపాడు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కొండవాగు పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది. మండలంలోని మార్కాపురం – తర్లుపాడు – సీతానాగులవరం మధ్య గురువారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి రోడ్లపైకి నీరు రావడంతో శుక్రవారం కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. చాలా రోజుల తర్వాత వర్షాలు కురవడంతో రైతులు పొలం పనులు చేసుకునేందుకు సమాయత్తం అవుతున్నారు.

పొంగి ప్రవహిస్తున్న ఏనుగుమందవాగు...



వేములపాడు వద్ద కంభం - కనిగిరి రహదారి బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న ఏనుగుమందవాగు

హనుమంతునిపాడు: మండలంలోని పలు గ్రామాలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. మండలంలోని రాజుగారిపల్లి, మహమ్మదాపురం, తాటిచెట్లపల్లి, వేములపాడు, గాయంవారిపల్లి, లింగంగుంట్ల గ్రామాల్లో కుండపోతకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వాగుకు అడ్డంగా రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ సహకారంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నిండాయి. ఏనుగుమందవాగులోని నీరు ఉధృతంగా పొంగిపొర్లి ప్రవహిస్తోంది. పొలాల్లో భారీగా వర్షం నీరు చేరింది. కుంటలు, చెక్‌డ్యాంలు నిండిపోయాయి. పశువుల మేతకు, తాగునీటికి ఈ వర్షాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రైతులు అంటున్నారు. పొలాల దుక్కులు దున్నుకుని పదును చేసుకునేందుకు, ఖరీఫ్ పంటలు సాగుచేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. సామాజిక వనాలు, పండ్ల తోటలకు కూడా ఎంతో మేలు జరుగుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



గాయంవారిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏనుగుమందవాగు

పొదిలి మండలంలో 15.6 మి.మీ వర్షం...

పొదిలి: మండల పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 5వ తేదీ 4.6 మి.మీ, 6న 7.2, శుక్రవారం 3.8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. మార్కాపురం అడ్డరోడ్డు పక్కన ఉన్న పెద్ద చెరువు వాగు ప్రవహిస్తోంది. పొదిలి పట్టణంలోని రోడ్డు మార్జిన్లు వర్షం నీటితో నిండిపోయాయి. ముందుగానే దుక్కులు దున్నిన పొలాలకు ఈ వర్షం ఎంతో మంచిదని రైతులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రైతులు దుక్కులు దున్నేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్ ముందుగానే ప్రారంభం అవుతుందనే ఆశతో రైతులు ఉన్నారు.



పొదిలిలో ప్రవహిస్తున్న పెద్ద చెరువు వాగు



సింగరాయకొండలో... వర్షం కురుస్తున్న దృశ్యం

భారీ వర్షం..

సింగరాయకొండ: మండలంలో శుక్రవారం సాయంత్రం సుమారు అరగంట సేపు భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రెండు రోజులుగా వాతావరణం మేఘావృతం అవుతున్నప్పటికీ తేలికపాటి జల్లులు మాత్రమే కురిశాయి. ఉదయం ఎండ తీవ్రత కారణంగా ప్రజలు ఇబ్బంది పడగా, సాయంత్రం వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది.

కుంటలు, చెరువుల్లోకి నీరు...

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజులుగా ఉరుములు, మెరుపులతో జోరు వాన కురుస్తోంది. శుక్రవారం ఉదయం, సాయంత్రం మంచి వర్షం పడింది. కుంటలు, చెరువుల్లో కొద్దిపాటి నీరు చేరింది. లోతట్టు పొలాల్లో వర్షం నీరు నిలిచింది. ఎక్కువగా చినారికట్ల, బచ్చలకూరపాడు, మునగపాడు, గొట్లగట్టు, పాతపాడు, చినమనగుండం, నాగంపల్లి, సలనూతల గ్రామాల్లో జోరు వాన కురిసింది.



గొట్లగట్టులో కురుస్తున్న వర్షం

నిమ్మ, బత్తాయి రైతులకు ఊరట...

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. నిమ్మ, బత్తాయి రైతులకు ఊరటనిచ్చింది. గుంతలు, పొలాలు, అటవీ ప్రాంతంలో వర్షం నీరు చేరుతుండటంతో పశుపోషకులు, జీవాల పెంపకందారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పామూరులో...

ఉరుములు, మెరుపులు..

టంగుటూరు: టంగుటూరు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రువారం రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో అన్ని ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. టంగుటూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న కొండపి ప్లై ఓవర్, టంగుటూరు సెంటర్లో వర్షం నీరు నిలిచి వాహనదారులు, పాదచారులకు ఇబ్బందిగా మారింది. ఈ వర్షంతో నేలలు పదునెక్కి పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగు, నువ్వు పంటలు వేసుకోవచ్చని వ్యవసాయాధికారిణి స్వర్ణలత తెలిపారు.



టంగుటూరులో భారీగా కురుస్తున్న వాన

16 మండలాల్లో వర్షం..

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని 16 మండలాల్లో గురువారం వర్షపాతం నమోదైంది. టంగుటూరులో 65 మిల్లీమీటర్లు, తర్లుపాడు 36.2, హెచ్‌ఎం పాడు 32.4, జరుగుమల్లి 22.8, వెలిగండ్ల 20, పీసీ పల్లి 17.2, ముండ్లమూరు 14.2, సీఎస్ పురం 10.2, కనిగిరి 9, త్రిపురాంతకం 4.2, పొదిలి 3.8, పామూరు 3.2, మద్రిపూడి, కొమరోలు 2.4 చొప్పున, ఎస్ కొండ, కంభం 1.6 చొప్పున మొత్తం 246.2 మిల్లీమీటర్లు, సరాసరి 6.3 మి.మీ వర్షపాతం నమోదైంది. 2023 జూన్ నుంచి ఇప్పటి వరకు నార్మల్ వర్షపాతం 841.3 మి.మీలు కాగా, 814.9 మి.మీలు కురిసినట్లు వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణకు ఆహ్వానం

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీవింగ్ మెషిన్ ఆపరేటర్ కోర్సులో కూడా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 3 నెలల ఈ కోర్సులకు 10వ తరగతి, ఆపై విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలను కూడా తమ సంస్థ కల్పిస్తుందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోపు ఎన్‌ఏసీ ట్రెనింగ్ సెంటర్, స్కిల్ హబ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9493920671 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు 287 మంది గైర్హాజరు

ఒంగోలు: ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా 287 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఏపీ ఓపెన్ స్కూల్ చైర్మన్ డి.సుభద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి సైన్స్ పరీక్షకు 672 మందికిగానూ 550 మంది హాజరయ్యారని చెప్పారు. ఇంటర్ ఫిజిక్స్ పరీక్షకు 1,145 మందికిగానూ 1,046 మంది, పొలిటికల్ సైన్స్ పరీక్షకు 455 మందికిగానూ 389 మంది హాజరయ్యారని వివరించారు. పదో తరగతి పరీక్షలకు 122 మంది, ఇంటర్ పరీక్షలకు 165 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.

రైల్వే లైన్‌కు భూ సేకరణ వేగవంతం

- ఆర్డీఓ జాన్ ఇర్విన్



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్ ఇర్విన్

పామూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం కోసం పామూరు మండలంలో ప్రతిపాదిత భూ సేకరణ పనులను వేగవంతం చేసినట్లు కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ తెలిపారు. ప్రతిపాదిత భూములను మండలంలోని రావిగుంటపల్లి, ఇనిమెర్ల వద్ద శుక్రవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. భూ సేకరణ, పరిహారం చెల్లింపు విషయాలపై తహసీల్దార్ షేక్ షాకీర్‌పాషాతో చర్చించారు. గతంలో మెరుగైన పరిహారం ఇప్పించాలని రైతులు కోరగా, దానిపై తహసీల్దార్‌తో ఆర్డీఓ చర్చించారు. పూర్తిస్థాయిలో భూమిని రైల్వే లైన్ పనులకు అప్పగించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రైల్వే లైన్ నిర్మాణానికి స్థానికులు, రైతులు సహకరించాలని కోరారు.

జగనన్న వెంటే మా ప్రయాణం

- తాజా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తమ ప్రయాణం సాగుతుందని, ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని యర్రగొండపాలెం తాజా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో తన సతీమణి భాగ్యసీమ చౌదరి, సోదరుడు సుధాకర్, కుమార్తె ఆకాంక్షతో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సాక్షితో కాసేపు ఆయన మాట్లాడారు. టీడీపీ వర్గీయులు తనపై అనేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరారు. అధికారం వచ్చిందన్న అహంభావంతో ఆ పార్టీకి చెందిన కొంతమంది గ్రామాల్లో రెచ్చిపోతున్నారని, అటువంటి పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని ఆయన సూచించారు. ప్రజలు ఇచ్చిన తీర్పునకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాలని, ఆ తీర్పే శిరోధార్యంగా భావించాలని అన్నారు. నియోజకవర్గంలో ప్రజలు వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తనకు ఓట్లు వేసి గెలిపించారని, వారికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. నియోజకవర్గ ఆవిర్భావం నుంచి ప్రజలు వైఎస్సార్ కుటుంబానికి అండగా నిలుస్తూ వచ్చారని, జగనన్న ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి పేద వర్గాలను ఆదుకున్నారని తెలిపారు. గత ఐదు సంవత్సరాల పాలన సుభిక్షంగా సాగిందని, రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని అన్నారు. 2014లో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారాన్ని చేజిక్కించుకున్న టీడీపీ.. తిరిగి అలాంటి వాగ్దానాలనే వల్లెవేసి ప్రజలను మభ్యపెట్టి ప్రస్తుతం అధికారంలోకి రాగలిగిందన్నారు. కష్టకాలంలో జగనన్న వెంట ఉండి ప్రజలకు సేవ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నానని తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. తాటిపర్తితో పాటు జగన్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శవలం కోటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ లియాఖత్, నవీన్‌కృష్ణారెడ్డి, ముజీబ్ పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.331

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు పొగాకు బోర్డు పరిధిలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నట్లు ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం 4736 బేళ్లు వేలానికి రాగా, 4343 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేసినట్లు చెప్పారు. కేజీ గరిష్టంగా రూ.331 పలకగా, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.278.22 వచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా మార్చి 6న ప్రారంభమైన డీసీ పల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి తదితర కేంద్రాల్లో 70వ రోజు వేలం జరుగుతున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో 5484 బేళ్లు రాగా, 4856 బేళ్లు కొనుగోలు అయ్యాయని, 628 బేళ్లు తిరస్కరించినట్లు చెప్పారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు అధైర్యపడొద్దు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి

- టీడీపీ దాడులను చట్టం, న్యాయం పరిధిలోనే తిప్పికొడదాం
- అందుకోసం ప్రతి నియోజకవర్గానికి ఒక అడ్వకేట్
- జిల్లా కేంద్రంలోనూ లీగల్ సెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ
- ఏ సమస్య వచ్చినా 24 గంటలు అందుబాటులో...
- వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి

ఒంగోలు: టీడీపీ దాడులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉండేందుకు వైఎస్సార్ సీపీ అధినాయకత్వం పూర్తిస్థాయిలో సంసిద్ధమైందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొజ్జా సురేంద్ర చక్రవర్తి తెలిపారు. అందులో భాగంగానే లీగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రతి నియోజకవర్గానికి ఒక అడ్వకేట్‌ను వైఎస్సార్ సీపీ కేంద్ర నాయకత్వం నియమించిందన్నారు. వారితోపాటు జిల్లా కేంద్రంలో మరికొంతమందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రచార మాధ్యమాలలో వైఎస్సార్ సీపీ నాయకులపై, నివాసాలపై దాడులు జరుగుతున్న దృశ్యాలను చూస్తున్నామని, ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయమనం వహించాలని సూచించారు. టీడీపీ, జనసేన వర్గీయులు ఎంత రెచ్చగొట్టినా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం కోల్పోరాదని కోరారు. మనమంతా కలిసి చట్టపరిధిలోనే టీడీపీ దాడులను తిప్పికొడదామని, న్యాయం కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిద్దామని అన్నారు. 24 గంటల పాటు మీకు సేవలు అందించేందుకు జిల్లా కేంద్రంలో ఐదుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లీగల్ సెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ సభ్యుల పేర్లు, వారి మొబైల్ నంబర్లను లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ ధర్నాసి హరిబాబు ప్రకటించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఒంగోలు నగర అధ్యక్షుడు కత్తి కోటేష్‌బాబు, కొండ్రెడ్డి కృష్ణారెడ్డి, గోపవరపు నారాయణరెడ్డి, కాకుటూరి సంపత్ పాల్గొన్నారు.

లీగల్ సెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ...

పురిణి సత్యన్నారాయణరెడ్డి	93904 11081
కోమట్ల సామిరెడ్డి	98857 77666
సానికొమ్ము రామిరెడ్డి	93933 60554
చావలి రమేష్‌బాబు	98483 62770
గోపవరపు నారాయణరెడ్డి	96769 42817

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి

- జిల్లాలో 1,545 డూప్లికేట్ ఓట్లు పోల్
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూశామన్న ఎస్పీ సుమిత్ సునీల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్:

జిల్లాలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 16వ తేదీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎన్నికల నిర్వహణలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సహకరించిన తీరును మరచిపోలేనని చెప్పారు. జిల్లాలో మొత్తం 18,22,470 మంది ఓటర్లు ఉండగా, వారిలో 16,13,255 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 28,058 పోస్టల్ ఓట్లు ఉండగా, వీటిలో 23,365 ఓట్లు వ్యాలిడ్ అయ్యాయని, 4,693 ఓట్లు ఇన్ వ్యాలిడ్ అయ్యాయని వెల్లడించారు. 1,554 ఓట్లకుపైగా డూప్లికేట్ ఓట్లు పోలయ్యాయని, దీనిపై విచారణ జరిపించనున్నామని తెలిపారు. డూప్లికేటు ఓట్లను స్కానింగ్ దశలోనే పసిగట్టినట్లు చెప్పారు. మొత్తం మీద 88.52 శాతం ఓట్లు పోలయ్యాయన్నారు. జిల్లాలో స్వీప్ ద్వారా ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వలన పోలింగ్ శాతం బాగా పెరిగిందని కలెక్టర్ అన్నారు. ఒంగోలు నగరంలోని రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో 371 సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సీ విజిల్ ద్వారా 1,157 ఫిర్యాదులు రాగా, 97 శాతం మేర పరిష్కరించామని, సరాసరి 28.47 నిమిషాల కాలంలో సదరు ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఎన్నికల ప్రక్రియలో మొత్తం రూ.7.22 కోట్ల విలువ గల వస్తువులను సీజ్ చేశామని చెప్పారు.

అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాం : ఎస్పీ

జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా పనిచేసినట్లు చెప్పారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఫలితాలు వెల్లడయ్యేంత వరకు పోలీసు శాఖలో ఉన్న హోంగార్డు నుంచి ఎస్పీ స్థాయి అధికారి వరకు ప్రతిఒక్కరూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించినట్లు చెప్పారు. ఎస్‌ఐలు, సీఐలు వేగంగా స్పందించారన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు సహకరించిన అన్నివర్గాల ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

క్లుప్తంగా

బూచేపల్లికి మాజీ మంత్రి మేరుగు శుభాకాంక్షలు


ఎమ్మెల్యే బూచేపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: దర్శి ఎమ్మెల్యేగా గెలిచిన బూచేపల్లి శివప్రసాద రెడ్డికి మాజీ మంత్రి మేరుగు నాగార్జున పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. దానితో పాటు ఎన్నికల ఫలితాలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖర రెడ్డి, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ దాడిలో గాయపడిన వారికి బూచేపల్లి పరామర్శ


ముప్పరాజు కోటేశ్వరమ్మను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి


ముప్పరాజు వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మండలంలోని తూర్పువీరాయపాలెం గ్రామంలో టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముప్పరాజు వెంకటేశ్వర్లు, ముప్పరాజు కోటేశ్వరమ్మ, ముప్పరాజు వెంకటేశ్వర్లును దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వారి తల, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వారిని చూసిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న దర్శి నియోజకవర్గంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని చెప్పారు. ఘటన జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటామని చెప్పారు. గొడవలు పెద్దవి చేసుకోకుండా సమన్వయంతో ఉండాలని సూచించారు. లీగల్ టీం ద్వారా అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని బూచేపల్లి హామీ ఇచ్చారు.

బాలస్వామిని పరామర్శించిన బూచేపల్లి...

దొనకొండ: దొనకొండ మండలం కొచ్చెర్లకోట పంచాయతీ సిద్ధాయపాలెంలో 3 రోజుల క్రితం టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన గ్రామానికి చెందిన చొప్పరపు బాలస్వామిని ఒంగోలు జీజీహెచ్‌లో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి శుక్రవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. నేనున్నానంటూ ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీటీసీ–2 మందగిరి ఆంటోబాబు, చొప్పరపు అర్లయ్య ఉన్నారు.

ఆర్టీసీ జోన్ చైర్మన్ పదవికి

సుప్రజ రాజీనామా


సింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆధునికీకరించిన దృశ్యం

- ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్‌గా సేవలు


బత్తుల సుప్రజ రెడ్డి

సింగరాయకొండ: ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ పదవికి బత్తుల సుప్రజ రెడ్డి రాజీనామా చేశారు. శుక్రవారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ తన పై నమ్మకం ఉంచి తనకు పదవి రావడానికి అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసుల రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, తనకు సహకరించిన ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె చేసిన పలు అభివృద్ధి పనులను వివరించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సుమారు 72 లక్షల అంచనా వ్యయంతో ఆధునీకరించడంతో పాటు అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం, మరుగుదొడ్లు, క్యాంటీన్ ఆధునీకరణ చేశామన్నారు. ప్రజల సౌకర్యార్థం పాకల నుంచి సింగరాయకొండకు నూతన బస్సు సర్వీసు ఏర్పాటు, పాదిలి నుంచి వేమవరం మీదుగా కనిగిరికి బస్సు సర్వీసు, కందుకూరు నుంచి రావులకొల్లు చుట్టుపక్కల గ్రామాల మీదుగా హైదరాబాద్‌కు బస్సు సర్వీసు, సింగరాయకొండకు దూర ప్రాంత బస్సు సర్వీసులు వచ్చేలా కృషి చేయడం, పలు గ్రామాలకు స్కూలు విద్యార్థుల సౌకర్యార్థం బస్సు ట్రిప్పులు వేయడం చేశామన్నారు. అలాగే కందుకూరు, ఒంగోలు, నెల్లూరు డిపోల నుంచి హైదరాబాద్‌కు నూతన బస్సులు ప్రారంభించడం, జోన్ పరిధిలోని ఆర్టీసీ డిపోల పరిధిలోని సమస్యలను పరిష్కరించడం జరిగిందని వివరించారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దర్శి: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7,8,9వ తరగతుల్లో మిగిలిన సీట్లకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ హసీనాభాను శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. సీట్ల కేటాయింపు ఖాళీ అయిన రిజర్వేషన్‌ల ప్రకారం భర్తీ చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్యపడవద్దని, భవిష్యత్తులో మళ్లీ మంచి జరుగుతుందని, అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. గత రెండు రోజుల నుంచి మార్కాపురంలోని ఆయన నివాసానికి మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాలకు చెందిన నాయకులతోపాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్న హనుమారెడ్డి వచ్చి మాట్లాడారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ దాదాపు 40 శాతం మంది ప్రజలు మనవెంట ఉన్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకుని ముందుకు అడుగులు వేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గానికి తనను మన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల ముందు నియమించినప్పటికీ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మర్చిపోనన్నారు. కొద్ది సమయంలోనే నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలతో, నాయకులతో, కార్యకర్తలతో, ఓటర్లతో మమేకమయ్యానని, తనకు సహకరించిన అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తానని, కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్య పడవద్దన్నారు. ఇప్పటివరకూ మీరు చూపిన అభిమానాన్ని బలంగా చేసుకుని ముందుకు సాగుతానని తెలిపారు. ఎవరూ అధైర్యపడి ఆందోళన చెందవద్దని అన్నారు. భవిష్యత్తు కచ్చితంగా మనదే అవుతుందని, త్వరలో అందరినీ కలుస్తానన్నారు.

నైతికంగా విజయం సాధించాం


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్


పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు

- దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని.. ఎవరూ అధైర్య పడొద్దని వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. దద్దాల మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో సుమారు 93 వేల మంది (46 శాతం మంది) తనకు ఓట్లు వేశారని, నైతికగా తాము విజయం సాధించామన్నారు. ప్రస్తుత అధికార పార్టీ నాయకుడి మాటలు నమ్మడంతో పట్టణాల్లో కొంత మేర పార్టీకి నష్టం వాటిల్లిందన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ పార్టీ ప్రతి పక్షం నుంచే పుట్టిందని, పోరాటాలు కొత్త ఏమీ కాదన్నారు. అధికార పార్టీ లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపిస్తూ పోరాటాలు సాగిద్దామన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ ప్రజా పక్షాన ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకుల అడుగుజాడల్లో, వారి సూచనల మేరకు ముందడుగు వేసి రాబోయే ఐదేళ్లు కార్యకర్తలకు, పార్టీ శ్రేణులకు, నాయకులు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు కావాలని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తారన్నారు. అధికారులు కూడా మనకు సహకరించే పరిస్థితి ఉండదని, అయినా ఎవరూ భయపడవద్దని, ఆందోళన చెందవద్దన్నారు. మనమంతా ప్రతి పక్షం నుంచే వచ్చామని, జగనన్న మనకు కొండంత అండగా ఉంటారని క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. ఒక్క పిలుపు తోనే వేలాది మంది పార్టీ అభిమానులు వచ్చారని.. ఇది మన వైఎస్సార్ సీపీ పార్టీకి కనిగిరి నియోజకవర్గంలో ఉన్న అభిమానం అని వర్ణించారు. కనిగిరిలో 46 శాతం ఓట్లు వైఎస్సార్ సీపీకి వచ్చాయని వివరించారు. ఎవరూ అదరొద్దు.. బెదరొద్దు.. అధైర్య పడొద్దు.. ప్రలోభాలకు లోనుకావద్దని కోరారు. తాను పారిపోయే వ్యక్తిని కాదని, అందరికీ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. రాబోయే రోజుల్లో అధికార పార్టీ చేసే తప్పిదాలను, లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తి చూపిస్తూ, పోరాటాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, జగనన్న సైనికులు, పార్టీ శ్రేణులు మన మంతా కష్టపడి పనిచేద్దామని.. తిరిగి జగనన్నను సీఎం చేసుకుందామని కోరారు. అలాగే అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమికి, కనిగిరిలో గెలిచిన ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, రామనతిరుపతి రెడ్డి, అత్యాల జఫన్య, ఒకేరెడ్డి, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, మాణిక్యరావు, సిరుప గోవర్ధన్ రెడ్డి, డాక్టర్ రసూల్, సూరసాని నర్సారెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, జీ బొర్రారెడ్డి, పెన్నా వెంకటేశ్వర్లు, చింతం శ్రీను, కంటు గురవయ్య, యక్కంటి శ్రీను, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్‌లు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా ఎదగాలి

- వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో డీఈఓ సుభద్రమ్మ పిలుపు


వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో ప్రసంగిస్తున్న డీఈఓ సుభద్రమ్మ

ఒంగోలు టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని, ఉన్నత శిఖరాలకు చేరుకుని బాధ్యత గల పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్రమ్మ సూచించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, షూతో పాటు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడం ద్వారా పేదరికాన్ని శాశ్వతంగా పారదోలేందుకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ఉపాధ్యాయులను, కుటుంబ పెద్దలను ఆదర్శంగా తీసుకుని పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్చుకున్న అంశాలలో మరింత నైపుణ్యాన్ని సాధించేందుకు ప్రయత్నించాలని, తరచూ గ్రంథాలయాలను సందర్శించడం, పుస్తకాలు చదవడం అలవాటుచేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వేసవి సెలవులను వృథా కానీయకుండా సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అభినందనలు తెలిపారు. చిన్నారులు ఇదే ఒరవడి కొనసాగించేలా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఆదివారం గ్రంథాలయానికి పిల్లలను తీసుకురావాలని, అచ్చుతప్పులు లేకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేయాలని కోరారు. పుస్తకం తలెత్తుకుని తిరిగేలా చేస్తుందని, మంచి వ్యక్తిత్వాన్ని అలవాటు చేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం 21 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని వివిధ అంశాలలో తర్ఫీదు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, దోస్తి ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్, ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు కొర్రపాటి సుధాకర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఉపాధ్యాయులు జాలాది మోహన్, షిరిడీ సాయిరాం, డి.లక్ష్మీప్రసాద్, ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఐ.నరసింహం, టి.శ్రీనివాసరావు, రాంబాబు, శ్రీనివాసరావు, తిమ్మిరి రవీంద్ర, టి.శిరీష తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన సత్యసాయి జిల్లా ఎడ్లు


పూసపాడులో బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడులో అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి బండ పందేల్లో సత్యసాయి జిల్లా సీకే పల్లి మండలం పుల్లేటిపల్లికి చెందిన బొబ్బిలి భాస్కర్‌రెడ్డి ఎడ్లు 3,845 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తాల వెంకట సుబ్బారెడ్డి ఎడ్లు 3767 అడుగుల దూరం లాగి రెండు, నంద్యాల జిల్లా జిల్లా పరం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన రెడ్డి ఎడ్లు 3250 అడుగుల దూరం మూడో స్థానంలో, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ఏ కోడూరుకు చెందిన చాగంటి నాగమల్లిఖార్జున రెడ్డి ఎడ్లు 3143 అడుగులతో నాలుగు, యర్రగొండపాలెంకు చెందిన హుస్సేన్ ఎడ్లు 3042 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.40 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దాతలు పంపిణీ చేశారు.

నాణ్యమైన పొగాకు బేళ్లు తీసుకురావాలి


టంగుటూరులో వేలం పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు

టంగుటూరు: రైతులు నాణ్యమైన పొగాకు బేళ్లను తీసుకుని వస్తే అత్యధిక ధరలు పొందవచ్చని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు సూచించారు, అలాగే అన్యపదార్థాలు, గేడు మిక్స్ లేకుండా తీసుకురావాలని రైతులను కోరారు. స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు శుక్రవారం వేలం ప్రక్రియని పరిశీలించారు. కె. ఉప్పలపాడు క్లస్టరు గ్రామాలకు చెందిన రైతులు 974 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 892 కొనుగోలు జరిగగా, 82 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ట ధర రూ. 330 పలకగా, కనిష్ట ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 278. 58 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పిడుగుపాటుకు పశుపోషకుడు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సర్పంచ్


ఘటనా స్థలంలో పడి ఉన్న గేదెలు

- 3 గేదెలు కూడా..


మృతుడు గంధం థామస్

పామూరు: పిడుగుపాటుకు పశుపోషకుడితో పాటు 3 గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని చిలంకూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు... చిలంకూరు ఎస్సీ కాలనీకి చెందిన గంధం థామస్ పశువుల కొట్టంలో గేదెలను కట్టివేస్తున్న సమయంలో పిడుగు పడగా థామస్ మృతి చెందాడు. అక్కడే ఉన్న 3 గేదెలు కూడా మృత్యువాతపడ్డాయి. థామస్‌ను ఆటోలో పామూరులోని వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పడంతో భౌతికకాయాన్ని మరలా ఇంటికి తరలించారు. ఘటనలో చనిపోయిన గేదెల విలువ రు.1.50 లక్షల దాకా ఉంటుందన్నారు. వివరాలు తెలుసుకున్న తహసీల్దార్ షేక్ షాకీర్‌పాషా చిలంకూరులోని మృతుని ఇంటికి వెళ్లి థామస్ భౌతికకాయాన్ని పరిశీలించి ఘటనపై కుటుంబ సభ్యులతో చర్చించి ప్రభుత్వం నుంచి సాయం వచ్చేలా చూస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ మలినేని శ్రీనివాసులు, వీఆర్వో రఫి ఉన్నారు. మృతునికి భార్య జయమ్మ, ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలున్నారు.

రెండు మేకలు..

పీసీపల్లి: విద్యుత్ షాక్‌తో రెండు మేకలు మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. మండల పరిధిలోని మారెళ్లలో బోయపాటి వెంకటేశ్వర్లుకు చెందిన రెండు మేకలు కంది మళ్ల బ్రహ్మయ్య ఇంటి వద్ద గల విద్యుత్ ఎర్త్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ. 40వేలు ఉంటుందని యజమాని వెంకటేశ్వర్లు వాపోయాడు.


పీసీపల్లి: మృతి చెందిన మేకలు

అనుమానంతో భార్యను హత్యచేసిన భర్త

- కత్తితో మెడపై నరికి చంపిన వైనం

చినగంజాం: భార్యను అనుమానించిన ఓ భర్త.. ఆమెను కత్తితో మెడపై నరికి చంపిన సంఘటన బాపట్ల జిల్లా చినగంజాం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన చినగంజాం పంచాయతీ మహాలక్ష్మీకాలనీకి చెందిన కత్తి దుర్గ (30)ను భర్త కత్తి శ్రీను దారుణంగా కత్తితో దాడి చేసి మెడపై నరికి చంపాడు. వీరికి 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా మహాలక్ష్మీకాలనీలో కాపురం ఉంటున్నారు. భార్య దుర్గ కొద్ది రోజులుగా తరచూ ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుందనే అనుమానంతో గొడవలు జరుగుతున్నాయి. భర్త వేధింపులు తట్టుకోలేని భార్య దుర్గ.. అదే కాలనీలో నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు నెల రోజుల క్రితం తన తొమ్మిదేళ్ల రెండో కుమార్తెను వెంట తీసుకుని వెళ్లిపోయింది. ఈ క్రమంలో శుక్రవారం భర్త కత్తి శ్రీను తన అత్తమామలు ఇంట్లో లేనివేళ వెళ్లి భార్యతో గొడవపడ్డాడు. ఇద్దరూ వాదులాడుకుంటుండగా, ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం కత్తితో ఆమె మెడపై నరికి దారుణంగా హత్య చేశాడు. ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న కుమార్తె పరిగెత్తుకుంటూ బయటకు వెళ్లి స్థానికులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి వెళ్లిన స్థానికులు పోలీసులకు తెలియజేశారు. పోలీసులు చేరుకునే సరికే దుర్గ మృతి చెంది ఉంది. ఆమె భర్త శ్రీను పరారీలో ఉన్నాడు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ, ఎస్‌ఐ...

సంఘటన స్థలాన్ని ఇంకొల్లు సీఐ బీ శ్రీనివాసరావు, చినగంజాం ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు పరిశీలించి శవ పంచనామా నిర్వహించారు. దుర్గ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు కత్తి శ్రీనును పట్టుకుంటామని చెప్పారు.

మేము ఇంట్లో లేని సమయంలో మా కుమార్తెను చంపాడు...

తాము ఇంట్లో లేకుండా వేటకు వెళ్లిన సమయంలో వచ్చిన తమ అల్లుడు శ్రీను తమ కుమార్తె దుర్గను కత్తితో దారుణంగా నరికి చంపాడని దుర్గ తల్లిదండ్రులు ఎం.అంజయ్య, రాగమ్మ పోలీసులకు తెలిపారు. పెళ్లయిన దగ్గర నుంచి తమ కుమార్తెను తరచూ వేధింపులకు గురిచేసేవాడని చెప్పారు. ఆమెకు ముగ్గురు బిడ్డలున్నారని, తమ కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను వారు కోరారు.